క్లుప్తంగా

సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



సత్తెమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మండలంలోని మహేంద్రవాడ బోర్డు పొలంలో కొలువుదీరిన సబ్బెళ్ల వారి సత్తెమ్మ తల్లిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఏటా మాఘ మాసంలో అమ్మవారి సంబరాన్ని నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

19న సర్వసభ్య సమావేశం

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

మహిళా అధ్యాపకులకు క్రీడా పోటీలు

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రాంగణంలో ఏపీ ఉమెన్ ఫోరమ్ ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులకు శనివారం క్రీడా పోటీలు జరిగాయి. ఫార్మా ఉమెన్స్ లీగ్ 2024 పేరిట క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్‌లో పోటీలు నిర్వహించారు. క్రీడా స్ఫూర్తితో విజయం కోసం కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ అన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర, డాక్టర్ సుందర్, డాక్టర్ రామచంద్రన్ పాల్గొన్నారు.

నేటి నుంచి సత్తెమ్మ తల్లి జాతర



మోక్షూరులో ఉన్న సత్తెమ్మ తల్లి

బిక్కవోలు: మండలంలోని మోళ్లూరు గ్రామంలో ఉన్న సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవం ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ జరుగుతుందని ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కొమ్మన వారి ఇలవేల్పు అయిన సత్తెమ్మ తల్లి జాతర రెండేళ్లకోసారి నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేస్తామన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న వేంకటేశ్వర స్వామి

పెదపూడి: సంపర వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మాఘ మాసంలో ఏడు శనివారాల వ్రతంలో భాగంగా రెండో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆలయంలో స్వామివారికి తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులచే గోవింద నామస్మరణలు ఆచరింపజేశారు.

నగదు ఇప్పించండి

సీతానగరం: తన భర్త ఏడాది క్రితం చనిపోయాడని, దానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయంగా వచ్చిన నగదును తనకు ఇప్పించాలని వంగలపూడికి చెందిన తిగిరిపల్లి మార్తమ్మ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త మృతి చెందినప్పుడు ప్రభుత్వం నుంచి రూ.1,08,075, మట్టి ఖర్చులు రూ.10 వేలు కలిసి మొత్తం రూ 1.18 లక్షలు వంగలపూడిలోని తన ఇండియన్ బ్యాంక్ ఖాతాకు జమ అయ్యాయని తెలిపింది. ఆ డబ్బుల కోసం బ్యాంక్ సిబ్బందిని అడగ్గా ఏఈపీఎస్/ ఎంఏటీఎం ద్వారా దఫదఫాలుగా తన నగదు డ్రా అయినట్టు తెలిపారన్నారు. దీంతో తనకు న్యాయం చేయాలని, సొమ్ములు ఇప్పించాలని పోలీసులను కోరింది.

వలంటీర్లకు వందనం అవార్డు గ్రహీతలు వీరే

బిక్కవోలు: మండలం నుంచి వలంటీర్లకు వందనం అవార్డులకు ఎంపికైనవారి వివరాలను ఎంపీడీవో వి.విజయలక్ష్మి వెల్లడించారు. శనివారం ఆమె మాట్లాడుతూ బలభద్రపురం సచివాలయం-3 నుంచి కొత్తపల్లి భాగ్యలత, కొప్పిశెట్టి సౌందర్య సేవా వజ్ర అవార్డుకు ఎంపికయ్యారని వారికి రూ.45 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారన్నారు. పందలపాక సచివాలయం-1 నుంచి గొర్రిపోటి మమత, ఊలపల్లి సచివాలయం-1 నుంచి మాడెం వీరవేణి, కొంకుదురు సచివాలయం-1 నుంచి ఇ.శివలక్ష్మి, కొమరిపాలెం సచివాలయం-2 నుంచి సరిపరపు అనూష, బిక్కవోలు-1 నుంచి జి.రాజేష్‌లకు సేవారత్న అవార్డు వచ్చిందన్నారు.

ట్యాబ్.. హ్యాట్సాఫ్

- విద్యార్థులకు అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం
- హర్షం వ్యక్తం చేస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు



ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లతో వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు

రంగంపేట: 'ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి.. పోటీ ప్రపంచంలో మేటిగా నిలబడాలి.. కార్పొరేట్ స్కూళ్లను అధిగమించేలా మార్కులు సాధించాలి.. విజ్ఞాన సముపార్జనలో ముందడుగు వేయాలి..' ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అందులో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాబ్‌లను అందించారు. వాటిలో బైజూస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ఎంతో విలువైన కంటెంట్‌తో పిల్లలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ చిత్తశుద్ధిపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రంగంపేట మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తంగా 590 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. విద్యార్థులు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఉపయోగించుకుంటూ సాంకేతిక విద్యను అందిపుచ్చుకుంటున్నారు.

అందుబాటులో డిజిటల్ విద్య



ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే లభించే డిజిటల్ విద్య జగనన్న ఇచ్చిన ట్యాబ్‌ల ద్వారా మాకు అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, బైజూస్ యాప్ ద్వారా పాఠ్యాంశాలు నేర్పించడంతో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు మాకు మార్గం సుగమమైంది.

– వై.మేఘన, 8వ తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్, సింగంపల్లి

జగన్ మావయ్య గ్రేట్



ముఖ్యమంత్రి జగన్ మావయ్య మాకు యూనిఫాం, పుస్తకాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు ట్యాబ్‌లు ఇచ్చారు. ట్యాబ్‌లో ఇచ్చిన బైజూస్ కంటెంట్‌తో ఎప్పటికప్పుడు పాఠ్యాంశాలను అవగాహన చేసుకుంటున్నాం. విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సౌకర్యాలు కల్పిస్తున్న జగన్ మావయ్య గ్రేట్.

– సీహెచ్ గంగాభవానీ, 8వ తరగతి విద్యార్థిని, దొడ్డిగుంట

సహకారం మరువలేం



పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించిన పాఠాల్ని ఇంటికి వెళ్లాక ట్యాబ్‌ల ద్వారా మళ్లీ అవగాహన చేసుకుంటున్నాం. బైజూస్ యాప్ ద్వారా ఎంతో సులభంగా పాఠ్యాంశాలపై పట్టు లభిస్తుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేం.

– టి.భాగ్యలక్ష్మి, 8వ తరగతి విద్యార్థిని, సింగంపల్లి

నేర్చుకోవడం సులభం



జగన్ మామయ్య ఇచ్చిన ట్యాబ్‌లతో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. బైజూస్ యాప్ ద్వారా పాఠ్యాంశాలు అవగాహన చేసుకోవడం ఎంతో సులభంగా మారింది. చిన్నప్పటి నుంచి సాంకేతికతపై పట్టు సాధించేందుకు సహకరిస్తున్న జగన్ మావయ్యకు థ్యాంక్స్.

– పి.శృతి, 8వ తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్, దొడ్డిగుంట

నేడు త్రిదండి చినజీయర్‌స్వామి రాక

మధురపూడి: కోరుకొండకు ఆదివారం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి రానున్నారు. ఆయన చేతుల మీదుగా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఆ ప్రకారం.. స్వామీజీ ఉదయం 10 గంటలకు కోరుకొండలోని ఎమ్మెల్యే రాజా స్వగృహంలో తీర్థగోష్టి నిర్వహిస్తారు. 10.45 నుంచి 11.30 వరకూ రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అక్షున్మోచనం కార్యక్రమం జరుగుతుంది. అనంతరం కోరుకొండలో రూ.3.80 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేస్తారు. 12 గంటలకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి మెట్లమార్గం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకూ ఆలయ ప్రాంగణంలో అనుగ్రహ భాషణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్మించిన అగ్నిమాపక కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

21న ద్విచక్రవాహనాల వేలం

రంగంపేట: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రంగంపేట స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు మూడు ద్విచక్ర వాహనాలకు 21వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు రంగంపేట సెబ్ స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనొచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 94401 65266 నెంబరులో సంప్రదించాలన్నారు.

అర్హులందరికీ నివాస స్థలాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వెలుగుబందలో భూముల పరిశీలన



వెలుగుబందలో సేకరించిన భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో అర్హత ఉన్న వారందరికీ నివాస స్థలాలను అందజేస్తామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇందులో భాగంగా మండలంలోని వెలుగుబందలో సేకరించిన భూములను శనివారం పరిశీలించారు. ఇప్పటికే దాదాపుగా అన్ని గ్రామాలలో నివాస స్థలాల పంపిణీ జరిగిందన్నారు. అయితే కొన్నిచోట్ల కోర్టు కేసుల మూలంగా కొంత జాప్యం జరుగుతోందన్నారు. వెలుగుబంద, దివాన్ చెరువు, లాలాచెరువులో నెలకొన్న ఈ సమస్యను త్వరగానే పరిష్కరించి, నివాస స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ విషయమై ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. ఎమ్మెల్యే వెంట సంబంధిత శాఖల అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించడానికి ప్రజలు సిద్ధం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కాండ్రేగులలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన కైకవోలులో నిర్మించిన సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించి, నూతనంగా ఏర్పాటుచేసిన దివంగత నేత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే కాండ్రేగుల గ్రామంలో రూ.1.58 కోట్లతో నిర్మించిన వాటర్ ట్యాంక్, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఎస్సీపేటలో నిర్మించిన కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాండ్రేగుల గ్రామం తనకెంతో ప్రత్యేకమైందన్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఈ గ్రామం నుంచి తనకు అత్యధిక మెజారిటీ వచ్చిందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తన విజయానికి విశేషంగా కృషి చేశారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో అంతకుమించి మెజారిటీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను అందరూ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులకు గ్రామస్తులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, పెదపూడి, అనపర్తి, బిక్కవోలు, జెడ్పీటీసీ సభ్యులు పేపకాయల వెంకటలక్ష్మి, సత్తి గీతా వరలక్ష్మి, రొంగల పద్మావతి, సర్పంచి కె.వీరవెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, శ్రీవత్సవాయి గోపాల సర్పరాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సాంబత్తుల చంటి, సర్పంచ్ నూని పట్టాభిరామన్న చౌదరి, ఉప సర్పంచ్ కొప్పిశెట్టి వీరశంకర్(పండు), పార్టీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి మాధవ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనే సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 5.37 లక్షలకు సంబంధించిన చెక్కులను రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని స్వగృహంలో శనివారం పంపిణీ చేశారు. మరో ఐదుగురికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గతంలో 1,059 రోగాలకు చికిత్స పొందడానికి మాత్రమే అవకాశం ఉండేదని, దానిని ప్రస్తుతం 3,254 వరకూ పెంచారన్నారు. అలాగే సాయాన్ని రూ.25 లక్షలకు పెంచారన్నారు. అయితే ఈ విధంగా కూడా అవకాశం పొందలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయాన్ని అందిస్తున్నారన్నారు.

రాష్ట్ర సేవాదళ్ జాయింట్ సెక్రటరీగా రాజు



యాక రాజు

సీతానగరం: వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మిర్తిపాడుకు చెందిన యాక రాజు ఎంపికయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. మిర్తిపాడుకు చెందిన యాక రాజు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ పార్టీకి సేవలు అందిస్తున్నారు. గతంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం మిర్తిపాడు పంచాయతీ 9వ వార్డు మెంబరుగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు సుధాకర్ బాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు)కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం




బాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



బలభద్రపురంలో జరిగిన బాబా రథోత్సవంలో చిన్నారుల కోలాటం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో కొలువైన ఆంధ్రా షిర్డీ సాయిబాబా వారి 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి పూజ, గణపతి హోమం, దత్తాత్రేయ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులు బాబా వారి మూలవిరాట్‌కు 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం చేశారు. అనంతరం బంగారు కిరీటంతో స్వామివారిని అలంకరించారు. మధ్యాహ్నం రెండు గంటలకు కోలాటంతో బాబా వారి రథోత్సవం చేశారు. ఈ సందర్భంగా బాబా వారిని దర్శించుకోవడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు బాబాకు క్షీరాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, రాష్ట్ర పౌల్ట్రీ పెడరేషన్ అధ్యక్షుడు కర్రి ముకుందరెడ్డి, కేపీఆర్ సంస్థల చైర్మన్ కొవ్వూరి పాపారెడ్డి, ప్రారిశామికవేత్త చింతా పాండురంగారెడ్డి, జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు బాబాను దర్శించుకున్నారు.

97 మంది రక్తదానం



అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: మండలంలోని రామవరంలో సబ్బెళ్ల సురేష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 97 మంది రక్తదానం చేశారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తనయుడు సురేష్‌రెడ్డి 25వ జయంతి సందర్భంగా సురేష్‌రెడ్డి స్నేహితులు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరంలోని డాక్టర్ వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంక్‌కు చెందిన వైద్య సిబ్బంది పాల్గొని రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు భౌతికంగా లేకపోయినా అతడి పేరుపై ట్రస్ట్ ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు సమాజంలో తన తనయుడిని సజీవంగా నిలుపుతాయన్నారు. అనంతరం అనపర్తి ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగుర్రెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవిందరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, ట్రస్ట్ సభ్యులు కర్రి శ్యాంప్రసాద్‌రెడ్డి, మల్లిడి శివకుమార్‌రెడ్డి, పులగం శివారెడ్డి, కర్రి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాప్ కట్టర్లతో పాడి రైతులకు మేలు




వడిశలేరులో పాడి రైతుకు చాప్ కట్టర్ అందిస్తున్న పశువైద్యాధికారి జాన్‌పాల్

రంగంపేట: చాప్ కట్టర్లతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల పశు వైద్యాధికారి ఈ.జాన్‌పాల్ అన్నారు. ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు రాయితీపై అందిస్తున్న పశుగ్రాసం ముక్కలుగా కత్తిరించే యంత్రాలు (చాప్ కట్టర్స్)ను వడిశలేరులో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం ఆరు చాప్ కట్టర్లు మంజూరవ్వగా వడిశలేరులో 4, ముకుందవరంలో 1, జి.దొంతమూరులో 1 చొప్పున పాడి రైతులకు అందించామన్నారు. ఒక్కో చాప్ కట్టర్ ఖరీదు రూ.33,970 కాగా ప్రభుత్వం రాయితీగా రూ.13,588 అందిస్తుందని, రైతులు రూ.20,382 చెల్లించి చాప్ కట్టర్ పొందవచ్చన్నారు. చాప్ కట్టర్ ఉంటే పాడి రైతులు గడ్డిని చేతితో ముక్కలుగా కత్తిరించే శ్రమ, కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు.

ఆరుగురికి కుక్కకాటు

సీతానగరం: రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామ నగరంలో శనివారం సాయంత్రం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. ఆ ప్రాంతానికి చెందిన మార్ని నాగ వెంకటేష్, బావిశెట్టి నారాయణమ్మ, శ్రీమంతుల రత్నాజీతో పాటూ మరో ముగ్గురిపై దాడి చేసి గాయపరిచింది. బాధితులకు సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు.

సేవకు ప్రతిరూపం వలంటీర్లు



పందలపాకలో వలంటీర్లను సత్కరించిన నాయకులు

బిక్కవోలు: వలంటీర్లు సేవకు ప్రతిరూపాలని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం పందలపాక సచివాలయం-1 వద్ద సచివాలయం-1, సచివాలయం-2 వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలు వేసి దోపిడికి తెరలేపితే సీఎం వైఎస్ జగన్ మాత్రం వలంటీర్లతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మచ్చాపాప, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు కర్రి సతీష్, రెడ్డి సత్తిరాజు, పడాల కృష్ణారెడ్డి, కర్రి ఇస్రారెడ్డి, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గొయ్యి



చీపురపల్లి - చినకొండేపూడి రోడ్డు మధ్యలో తవ్విన గొయ్యి

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి – చీపురపల్లి రోడ్డు మధ్యలో గొయ్యి ప్రమాదకరంగా మారింది. పంట పొలాల్లోకి నీరు వెళ్లడం లేదని తవ్విన ఈ గొయ్యిని ఇంత వరకూ పూర్తిగా పూడ్చలేదు. దీనితో వాహనచోదకులు పలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ గొయ్యి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

రైతులు అధిక దిగుబడులు సాధించాలి



దోమాడ ఆర్బీకేలో ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి హరి

పెదపూడి: రైతులు వ్యవసాయశాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించి సాగులో అధిక దిగుబడులు సాధించాలని కాకినాడ జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి హరి రైతులకు సూచించారు. మండలంలోని దోమాడలో రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ ప్రగతికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ చీడ పీడల నుంచి పంటను ఏ విధంగా సంరక్షించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఏఓ మణిదీప్, ఏఈఓ స్వామి, వ్యవసాయ సహాయకుడు దేవగుప్తాపు శ్రీను, సర్పంచ్ మీనవల్లి శారదదేవి, మీనవల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

గోదావరి నీటి సరఫరాకు అంతరాయం

రాజానగరం: వేమగిరికొండపై ఏర్పాటు చేసిన రిజర్వాయర్ నుంచి మండలంలోని గ్రామాలకు సరఫరా అవుతున్న గోదావరి నీటికి మూడు రోజుల పాటు అంతరాయం కలగనుంది. మండలంలోని నామవరం, సంపత్‌నగరం, భూపాలపట్నం గ్రామాలతోపాటు శ్రీకృష్ణపట్నం నుంచి చక్రద్వారబంధం మీదుగా వెలుగుబందకు ఈ నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే చక్రద్వారబంధం వద్ద ఈ పథకానికి సంబంధించిన పైపులు దెబ్బతినడంతో వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ కారణంగా వెలుగుబంద వైపు వెళ్లే గోదావరి జలాల సరఫరాకు ఆది, సోమ, మంగళవారాల్లో అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్ తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.